పలు అభివృద్ధి పనులకు తీర్మానం

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి పలు తీర్మానాలు చేశారు. సోమవారం మేయర్ మద్దెల లత అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. వివిధ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు, పార్కుల అభివృద్ధికి నిధుల అంచనా వ్యయాన్ని రూపొందించారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. – బండ్లగూడ

ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు

బండ్లగూడ, జూన్ 24: రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ప్రజల నుంచి ఐదు ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ తెలిపారు. మూడు టౌన్ ప్లానింగ్, రెండు ఇంజినీరింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వాటిని త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు కమిషనర్ రవికుమార్ తెలిపారు.

డిజిటలైజేషన్‌తో మెరుగైన విద్యుత్ సేవలు

- విద్యుత్‌శాఖ డీఈ శివశంకర్

మణికొండ, జూన్ 24: విద్యుత్ సరఫరా మెరుగుపరిచి ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు ప్రతి విద్యుత్ స్తంభం సమాచారం డిజిటలైజేషన్ చేస్తున్నామని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజనల్ ఇంజినీర్ ఎం.శివశంకర్ తెలిపారు. సోమవారం టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఉన్న విద్యుత్ వ్యవస్థను ఆధునీకరించి సమాచారాన్ని కంప్యూటరీకరణ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఈ శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వినియోగదారులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఆధునికరించడానికి క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు మరింత చేరువతో పని చేస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. అసిస్టెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, సబ్ ఇంజనీర్ చెన్నారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ డిజిటలైజేషన్ పనులను పరిశీలిస్తున్న ఇబ్రహీంబాగ్ డీఈ శివశంకర్ తదితరులు

బోనాల పండుగను ప్రశాంతంగా నిర్వహించాలి

ఆలయ కమిటీల సభ్యుల సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

జూబ్లీహిల్స్, జూన్ 24 : బోనాల పండుగను ప్రశాంతంగా నిర్వహించాలని డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ పేర్కొన్నారు. సోమవారం యూసుఫ్‌గూడ సర్కిల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బోనాల నిర్వహణపై అధికారులు, ఆలయ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. జూలై 7 నుంచి 28 వరకు నిర్వహించనున్న బోనాల ఉత్సవాల కోసం జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాలతోపాటు ప్రభుత్వ శాఖల అధికారులు, ఆలయ కమిటీల సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు రోడ్లు, ఇతర మౌలిక వసతులు.. శానిటేషన్ అధికారులు పారిశుధ్య నిర్వహణ, వైద్యాధికారులు హెల్త్‌క్యాంప్‌లు, విద్యుత్ అధికారులు వీధి దీపాల నిర్వహణ.. పోలీస్, ట్రాఫిక్ అధికారులు భద్రత, రద్దీ నియంత్రణ పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. కమిటీల సభ్యులు సహకారం అందించాలన్నారు. సమావేశంలో ఖైరతాబాద్ తాసీల్దార్ నయీముద్దీన్, యూసుఫ్‌గూడ సర్కిల్ ఈఈ రాజ్‌కుమార్, ఏఎంఓహెచ్ డాక్టర్ ప్రవీణ,ఎస్ఎస్ విజయ్‌కుమార్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యులను క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ కౌన్సిల్‌లో చేర్చాలి

ఖైరతాబాద్, జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్లినిక్ ఎస్టాబ్లిష్‌మెంట్ కౌన్సిల్‌లో ఆయుష్ వైద్యులను సభ్యులుగా చేర్చాలని కోరుతూ సోమవారం రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు రాష్ట్ర విశ్వ ఆయుర్వేదిక్ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సూర్యపల్లి సారంగపాణి, డాక్టర్ బి. కిషన్ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఆల్లోపతి వైద్యులు, పోలీసుశాఖ నుంచి మొత్తం 11 సభ్యులతో ఏర్పాటు చేసిన కౌన్సిల్‌లో ఆయుష్‌కు సంబంధించిన వైద్యులను తీసుకోకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ఆయుష్ క్లినిక్స్, ఆస్పత్రులపై అవగాహన లేని కారణంగా పరిశీలన సమర్థవంతంగా జరిగే అవకాశం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించి ఆయుష్ వైద్యులను కౌన్సిల్‌లో చేర్చాలని కోరారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహాకు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ సారంగపాణి, డాక్టర్ కిషన్

త్వరగా డబుల్ ఇండ్లను కేటాయించాలి

సికింద్రాబాద్,జూన్ 24: సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సోమవారం సీతాఫల్‌మండి కార్పొరేటర్ జిల్లా కలెక్టర్ అనుదీప్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సుభాష్ చంద్రబోస్ నగర్‌లోఖాళీగా ఉన్న డబుల్ ఇండ్లను లబ్ధిదారులకు అందజేయాలని కోరారు.

హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో సెక్యులర్ ప్యానెల్ విజయం

ఎర్రగడ్డ, జూన్ 24: బోరబండలోని ఎన్ఆర్ఆర్ పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పాలక మండలి ఎన్నికల్లో సెక్యూలర్ ప్యానెల్ విజయం సాధించింది. ఈ ప్యానెల్‌కు చెందిన ఏడుగురు అభ్యర్థులు విజయంసాధించగా యునైటెడ్ ప్యానెల్ నుంచి నలుగురు మాత్రమే గెలుపొందారు. ఎన్నికల అధికారిగా గృహ నిర్మాణ సహకార సంఘం అధికారి ఎండీ యూసుఫ్‌అలీ వ్యవహరించారు. విజయం సాధించిన సెక్యులర్ ప్యానెల్ అభ్యర్థులు బోరబండలోని సైట్–1 నుంచి సైట్–5 కాలనీ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పలు చోట్ల బీఆర్ఎస్ నాయకులు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు వారికి ఘన స్వాగతం పలికి మిఠాయిలు తినిపించారు. కాగా పాలక మండలికి ప్రాతినిధ్యం వహించబోతున్న తాజాగా గెలుపొందిన అభ్యర్థులతో బుధవారం సమావేశం నిర్వ హిస్తున్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు. కాగా ఇరు ప్యానళ్ల నుంచి చాట్ల ఈలయ్య, సి.అమృత, అక్తర్‌సుల్తానా, షేక్ యూసుపుద్దీన్, ఇమామ్‌ఘోరి,.సత్యనారాయణ, సీఎస్ రామ్మోహన్‌రావు, అహ్మద్‌అలీ, సత్తాజీ, సాయినాథ్‌రావు, అబ్దుల్‌రహ్మాన్ గెలుపొందారు.

సెక్యూలర్ ప్యానెల్ అభ్యర్థులను సన్మానిస్తున్న స్థానికులు

బాలికపై లైంగిక దాడి.. నిందితుడి అరెస్టు

శంషాబాద్ రూరల్, జూన్ 24 : బాలికపై చిన్నాన లైంగికదాడి చేసిన ఘటన శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. శంషాబాద్ పట్టణంలోని కాపుగడ్డకు చెందిన యాఖేష్ సోదరుడు 2నెలల కిందట చనిపోయాడు. దీంతో వారికి అండగా ఉండాల్సిన బాబాయి ఈ నెల 20న ఇంట్లో ఒంటరిగా ఉంటున్న బాలిక(14)ను బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. జరిగిన ఘోరాన్ని బాలిక తన తల్లితో చెప్పింది. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సీఐ బాలరాజు తెలిపారు.

చెంచు తెగలను కాపాడాలి

దాడికి గురైన మహిళ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రామచంద్రనాయక్

ఖైరతాబాద్, జూన్ 24 : రాష్ట్రంలో గిరిజన, ఆదివాసీ, చెంచులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు రామచంద్రనాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మూలచింతపల్లిలో దాడికి గురైన మహిళ, ఆమె కుటుంబసభ్యులను మోహన్‌సింగ్,ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్‌తో కలిసి పరామర్శించారు. బంజారాలు, ఆదివాసీ, గిరిజనులపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంతరించిపోతున్న చెంచు తెగలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బాధిత మహిళకు న్యాయం చేసి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. వారి వెంట ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్ తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో నాణ్యత పాటించాలి

జూబ్లీహిల్స్, జూన్ 24 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను నాణ్యతతో చేపట్టాలని యూసీడీ డీపీఓ వెంకటకిషన్‌రావు అన్నారు. సోమవారం రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లోని పాఠశాల విద్యా కమిటీ కార్యాలయంలో పాఠశాలల్లో చేపడుతున్న పనులపై ఎస్ఎల్ఎఫ్, టీఎల్ఎఫ్ మహిళా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని త్వరగా పనులు పూర్తిచేయాలని సూచించారు. పనుల పురోగతిని సమీక్షించారు. సమావేశంలో డిప్యూటీ ఐఓఎస్ శ్రావణ్‌కుమార్, సర్వశిక్ష ఏఈ, యూసీడీ సీఓ వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ప్రతినిధులతో మాట్లాడుతున్న అధికారులు

కీర్తిలాల్ జ్యువెలర్స్‌కు 'ప్రేరణ' పురస్కారం

జూబ్లీహిల్స్, జూన్ 24 : కీర్తిలాల్ జ్యువెలర్స్‌కు 'ప్రేరణ పురస్కారం' అవార్డు వరించింది. 'టీమ్ మార్క్స్ మెన్' సంస్థ ఎంప్లాయి సెంట్రిసిటీ, సంస్థాగత ప్రయోజనాలు, అంతర్గత పర్యావరణ వ్యవస్థ, పనిపట్ల నమ్రత, వైవిధ్యత, సమానత్వం, వృద్ధి, రివార్డులు సామాజిక సమన్వయం వంటి అంశాలు ప్రామాణికంగా నిర్వహించిన 'సమగ్ర పరిశోధన ప్రేరణ..2024–25' విభాగంలో ఈ అవార్డు వచ్చింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో సంస్థ సహ వ్యవస్థాపకులు, సీఈఓ రాజేశ్ ఖుబ్ చాందినీ, సహ వ్యవస్థాపకులు శరద్ గుప్తాలతో కలిసి మాజీ పార్లమెంట్ సభ్యులు జయప్రద కీర్తిలాల్స్ రిటైల్ సేల్స్ అండ్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ ముత్తుకుమార్‌కు అవార్డు ప్రదానం చేశారు.

సన్మానం

రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శీలం వెంకట్‌రెడ్డిని సన్మానించిన పదో తరగతి సహ విద్యార్థులు. – శంషాబాద్ రూరల్

పౌర సేవలను సమర్థవంతంగా నిర్వహించాలి

జూబ్లీహిల్స్,జూన్ 24 : మీ సేవా సెంటర్ల ద్వారా పౌర సేవలను సమర్థవంతంగా నిర్వహించాలనిఖైరతాబాద్ తాసీల్దార్ నయీముద్దీన్ ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో మీసేవా కేంద్రాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో నయీముద్దీన్ మాట్లాడుతూ.. మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పౌర సేవలు అందించాలని సూచించారు. వివిధ సేవలకు చెల్లించాల్సిన రుసుమును బోర్డుపై ప్రదర్శించాలని, అధిక చార్జీలు వసూలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తాసీల్దార్‌లు ఎస్.నవీన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, నిర్వాహకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లపై పనిభారం

హిమాయత్‌నగర్,జూన్ 24: రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న టీచర్లు పనిభారం కారణంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.కరుణకుమారి అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఐసీడీఎస్ పథకం కింద పని చేసే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేయించుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 10ని సవరించాలని, అంగన్‌వాడీ సెంటర్లకు 10 నెలల అద్దె బకాయిలు, గ్యాస్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు.

అప్పులు తీర్చలేక వ్యక్తి ఆత్మహత్య

బాబుకుట్టి(ఫైల్)

హిమాయత్‌నగర్, జూన్ 24: బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు తీర్చలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న పులి మూతిన్‌థామస్ బాబుకుట్టి(60) బషీర్‌బాగ్ ఓల్డ్ కమెలాలోని తిరుమల అపార్ట్‌మెంట్‌లో ఉన్న కేబుల్ టీవీ కార్యాలయంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం వివిధ బ్యాంకుల నుంచి అప్పులు తీసుకుని తిరిగి చెల్లించలేపోయాడు. బ్యాంకు అధికారులు పలుమార్లు ఇంటికి వచ్చి రుణం చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో మానసికంగా కుంగిపోయిన బాబు కుట్టి సోమవారం ఇంటి నుంచి కేబుల్ టీవీ కార్యాలయానికి వచ్చి నైలాన్ తాడుతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాబుకుట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేశ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మత్తులో యువకుల హల్‌చల్

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: గంజాయి మత్తులో ముగ్గురు యువకులు రెచ్చిపోయి ఓ దుకాణంలోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పి.మధు తెలిపిన వివరాల ప్రకారం.. దానమ్మ జోపిడిలో ఓ వ్యక్తి హెయిర్ సెలూన్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి ముగ్గురు యువకులు అయ్యాన్, సర్వస్, నదీమ్ షాపులోకి వచ్చి కటింగ్ చేయాలని కోరారు. కటింగ్ చేసిన తర్వాత డబ్బులు అడగడంతో గంజాయి మత్తులో ఉన్న ఆ ముగ్గురు యువకులు షాపు యజమానిపై దాడికి పాల్పడ్డారు. పిడిగుద్దులు గుద్దుతూ విచక్షణారహితంగా దాడి చేశారు. అలాగే షాపులోని ఫర్నిచర్, అద్దాలు తదితర సామగ్రిని ధ్వంసం చేశారు. దాంతో బాధితుడు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటన స్థలానికి చేరుకోని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేద విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ

ఖైరతాబాద్, జూన్ 24 : ఖైరతాబాద్ శివలాల్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 21 ఏండ్లుగా పేదలకు సేవలందిస్తున్నారు.. ట్రస్ట్ చైర్మన్ ఎం. మహేశ్‌యాదవ్. సోమవారం ఖైరతాబాద్ బడా గణేశ్ ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 500 మంది విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, పెన్నులను స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్న వారినే మర్చిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తన తండ్రి శివలాల్ యాదవ్ పేరిట 21 ఏండ్లుగా మహేశ్‌యాదవ్ పేదలకు సేవలందించడం గొప్ప విషయమన్నారు. అదే స్ఫూర్తితో మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా షూస్ అందజేస్తానని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ మహేశ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రపంచ విజేత అలెగ్జాండర్ స్ఫూర్తితో తాను సంపాదించిన దానిలో కొంత సేవలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు గజ్జెల నాగేశ్, నవీన్‌యాదవ్, అశోక్, పృథ్వీరాజ్, రాజేందర్ యాదవ్, రాజు, సురేందర్, సుజాత, రమాదేవి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందజేస్తున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మహేశ్ యాదవ్ తదితరులు

అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 24: ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కాటేదాన్‌లోని తన కార్యాలయంలో సోమవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో మంజూరైన పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. పెండింగ్ పనులను సమీక్షించాలన్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ, నూతన సీసీ రోడ్లు, బాక్స్‌డ్రైన్ వర్క్, నాలా పనులను పూర్తి చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈ నాగేందర్‌గౌడ్, డీఈ మధుసుధన్‌రెడ్డి, ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

విద్యుత్ కోతల్లేకుండా చూడాలి..

వర్షాకాలంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ప్రజలకు విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం విద్యుత్‌శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా మంజూరైన నిధుతో స్ట్రీట్‌లైట్స్, పెండింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, శ్రీకాంత్, మహేందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వృద్ధురాలు ఆత్మహత్య

- కేసు దర్యాప్తు చేస్తున్న మధురానగర్ పోలీసులు

వెంగళరావునగర్, జూన్ 24: జీవితంపై విరక్తి చెందిన వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రహ్మత్‌నగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్ బి.వెంకట్‌రెడ్డి కాలనీలో ఎస్. యాదగిరిరెడ్డి, సర్వయ్యగారి విజయలక్ష్మి(61) దంపతులు నివాసం ఉంటున్నారు. ఆదివారం మధ్యాహ్నం వారి కుమారుడు ఆర్డర్ చేసిన వాషింగ్ మెషిన్ ఇంటికి వచ్చింది. డెలివరీ బాయ్ రావడంతో యాదగిరిరెడ్డి కిందకు దిగారు. తిరిగి భవనం ఐదో అంతస్తులోని ఇంటికి వెళ్లి భార్యను ఎంత పిలిచినా తలుపు తెరవలేదు. ఫ్యాన్‌కు చీరతో ఉరి బిగించుకుని విజయలక్ష్మి వేలాడుతూ కనిపించింది. తల్లిదండ్రులు బాల్యంలోనే మరణించడంతో విజయలక్ష్మి అప్పటి నుంచే మానసికంగా కుంగిపోయిందని భర్త యాదగిరిరెడ్డి పోలీసులకు తెలిపారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం గాంధీ దవాఖానా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎల్లారెడ్డిగూడలో బాలిక ఆత్మహత్య

వెంగళరావునగర్, జూన్ 24: గిఫ్ట్ షాపులో పనిచేసే బాలిక బలవన్మరణానికి పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో జరిగింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన జోష్నశ్రీ(17) అక్కడి గురుకుల కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరం చదువుతున్నది. కామెర్ల బారినపడి పరీక్షలు రాయలేకపోయింది. హైదరాబాద్‌కు వచ్చి ఎల్లారెడ్డిగూడ హబీబ్‌బాగ్‌లో స్టాఫ్ నర్సుగా పనిచేసే పిన్ని వద్ద ఉంటున్నది. ఈ క్రమంలో అమీర్‌పేట లాల్‌బంగ్లాలోని గిఫ్ట్‌షాప్‌లో నెల క్రితం రూ.10 వేల జీతానికి ఉద్యోగంలో చేరింది. అయితే పని సరిగా పనిచేయడం లేదంటూ దుకాణ యజమానురాలు ఆమెని మందలించింది. అంతటితో ఆగకుండా బాలిక తల్లి రజనీకి ఫోన్ చేసి చెప్పింది. దాంతో తల్లి కూడా ఫోన్‌లో మందలించింది. దాంతో మనస్తాపం చెందిన జోష్నశ్రీ షాప్‌కు వెళ్లకుండా.. 3 రోజుల నుంచి ఎవరితోనూ మాట్లాడకుండా రూమ్‌లోనే ఉండిపోయింది. తనుకు బతకాలని లేదని పిన్ని స్వరూపకు, తల్లికి ఏడిస్తూ చెప్పింది. సోమవారం రూమ్‌లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.



మృతిచెందిన జోష్నశ్రీ(ఫైల్)

కాగా కుటుంబసభ్యులు పోలీసులకు రాసిచ్చిన ఫిర్యాదులో జోష్నశ్రీ ఆత్మహత్యకు షాపు యజమానురాలే కారణమని ఫిర్యాదు చేస్తే.. పెన్నుతో యజమానురాలనే పదాన్ని పోలీసులు కొట్టివేయడం పలు అనుమానాలకు తావిస్తోంది.

పోలీసు ఉన్నతాధికారులు కల్పించుకుని తమకు న్యాయం చేయాలని కుటుంబసభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో ద్వారకను చేర్చాలి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిశోర్‌కుమార్, షాహిద్‌ఖాన్, రవీంద్రజిత్

ఖైరతాబాద్, జూన్ 24 : శ్రీ కృష్ణుడు నిర్మించిన ద్వారక నగరాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చాలని ఇట్స్ సిక్స్ వావ్ సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షాహిద్‌ఖాన్, రవీంద్రజిత్ పేర్కొన్నారు. ప్రపంచ చరిత్ర దినోత్సవం సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సముద్రంలో నీట మునిగిన ద్వారకా నగరంపై అనేక పరిశోధనలు చేశామని, ఒకప్పుడు ద్వారాక ప్రపంచ రాజధానిగా ఉండేదని, ఈ నగరాన్ని సంరక్షిస్తే మహాభారతానికి సంబంధించిన ఎన్నో కీలక ఆధారాలను బయటపెట్టవచ్చని తెలిపారు. రామప్ప, చార్మినార్ లాంటి కట్టడాలను వారసత్వ సంపదగా గుర్తించారని, ఘనమైన చరిత్ర ఉన్న ద్వారక నగరాన్ని ప్రపంచ, జాతీయ వారసత్వ ప్రదేశంగా గుర్తించాలన్నారు. ఇందుకోసం జై ద్వారక ప్రచారాన్ని ప్రారంభించామని తెలిపారు. అనంతరం జై ద్వారక ప్రత్యేక వెబ్‌సైట్, పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో సంస్థ తెలంగాణ చైర్మన్ కళాధర్ వల్లం, సహాయ కార్యదర్శి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

27న బొజ్జ తారకం జయంతి

హిమాయత్‌నగర్,జూన్ 24: సామాజిక ఉద్యమకారుడు, న్యాయవాది, దివంగత బొజ్జ తారకం 85వ జయంతి సందర్భంగా ఈనెల 27న బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌క్లబ్‌లో పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించను న్నట్లు బొజ్జా తారకం ట్రస్ట్ సమన్వయకర్త గనుముల జ్ఞానేశ్వర్ తెలిపారు. సోమవారం హైదర్‌గూడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత, వామపక్ష, పౌరహక్కుల ఉద్యమాల్లో బొజ్జ తారకం క్రియాశీలంగా ఉంటూ సేవలు అందించారని అన్నారు. ఆయన రచించిన ఎన్నో పుస్తకాలు సమాజాన్ని మేల్కొలిపేలా, సామాజిక మార్పునకు దోహదపడే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పుస్తకాల ఆవిష్కరణ సభకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ జి.చంద్రయ్య, తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.